క్లుప్తంగా

నాణ్యతలో రాజీ పడవద్దు



పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టిని పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

కమలాపురం : పశువుల షెడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పడవద్దని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పాచికలపాడులో రైతు సుదర్శన్‌రెడ్డి నిర్మించిన పశువుల షెడ్‌తో పాటు పాచికలపాడు, సి.గోపులాపురం గ్రామాల్లో పశువుల దాహార్తి కోసం నిర్మించిన నీటి తొట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతు పశువుల షెడ్లు నిర్మించుకోవచ్చన్నారు. షెడ్లు కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే షెడ్లు నిర్మించుకున్న రైతుల బిల్లులు పెండింగ్‌లో లేకుండా అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే షెడ్ల నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌస్ బాషా, ఏపీఓ పార్థ సారధి, జేఈ ఉపేంద్ర, బీఎఫ్‌టీ మహేశ్వరీ, ఎఫ్‌ఏలు రాజు, జగదీశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం



కాలిపోతున్న గడ్డివాము

మైలవరం : మైలవరం మండలం వద్దిరాల గ్రామానికి చెందిన పెద్దఓబులేసు గడ్డి వాము మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నికి ఆహుతైంది. నివాస గృహాలకు దగ్గరలోనే ఉన్న తన కలములో 30, 40అ డుగుల పొడవు ఉన్న భారీ గడ్డి వామును మూడునెలల కిందటే వేసుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత మంటలు ఎగిసి పడుతుండటంతో స్థానిక అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. అయితే ఫైరింజన్ జమ్మలమడుగు నుంచి వచ్చి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. గడ్డి వాము విలువ రూ. 50 నుంచి 60వేలు ఉంటుందని స్థానిక రైతులు తెలుపుతున్నారు. అయితే వారికి గిట్టని వారే ఈ పనిచేసి ఉంటారని గ్రామస్తులు భావిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలో చీనీ పంటలపైన, ప్రకతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అయన అవగాహన కల్పించి మాట్లాడారు. చీనీ పంటలో చీడ, పీడలు రాకుండా ద్రవ జీవామృతం స్ప్రే చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ నరసింహారెడ్డి, మాస్టర్ ట్రైనర్ నాగసుబ్బరాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బస్సు పాసుల కోసం తిప్పలు



బస్సు పాసుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

పులివెందుల రూరల్ : పాఠశాలలు, కళాశాలలు పునరుద్ధరణ కావడంతో పులివెందుల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పులివెందులలోని కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులతో ఆర్టీసీ బస్టాండు ఆవరణం కిటకిటలాడింది. బస్సు పాసుల కోసం విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. బస్సు పాసుల కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థుల బస్సు పాసుల కోసం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. గ్రామాల నుంచి విద్యార్థులు బస్టాండులో బస్సు పాసుల కోసం బారులు తీరి నిలబడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో బస్సు పాసులు అందించాలని కోరుతున్నారు.

అర్హులకు అందని ప్రభుత్వ పథకాలు

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందని పరిస్థితి ఉందని, ఏదో ఒక కొర్రి పెట్టి సంక్షేమ పథకాలు కోత కోస్తున్నారని జడ్పీటీసీ తమ్మిశెట్టి బాలయ్య తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల మండలం సర్వసభ్య సమావేశాన్ని మండల ఉపాధ్యక్షుడు మల్లు వెంకటమోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం చాలా మంది తల్లులకు పడలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రైతులకు సక్రమంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొర్రీలతో తల్లికి వందనం కొందరికే..

- తల్లికి వందనం అమలులో సవాలక్ష కొర్రీలు
- గ్రామాలలో, పట్టణాలలో సచివాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న తల్లులు
- గత ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు
- కూటమి ప్రభుత్వంలో కొందరికే సంక్షేమ ఫలాలు



తల్లికి వందనం అందలేదంటు ఎర్రగుంట్లలోని 6వ వార్డు సచివాలయంకు వచ్చిన బాధితులు

జమ్మలమడుగు : అన్ని అర్హతలు ఉన్నా సవాలక్ష కొర్రీలతో తల్లికి వందనం పథకాన్ని పేదలకు కూటమి ప్రభుత్వం దూరం చేస్తోంది. ఎర్రగుంట్ల మండలంంలోని చాలా మందిని అనర్హుల జాబితాల్లో చేర్చి పథకం వర్తింప చేయలేదు. దీంతో తల్లులందరు వారి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను చేత పట్టుకుని ప్రభుత్వ కార్యాలయం, సచివాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. కూలీనాలీ చేసుకునే కుటుంబాలను సైతం ప్రతి నెలా 300 యూనిట్లు కరెంట్ ఖర్చు చేస్తున్నారు అంటూ పక్కన పెట్టారు. ఏసీ, ఫ్రిజ్ కూలర్లు, టీవీలు, మూడు ఫ్యాన్లు ఉన్నవారికి కూడా 300 యూనిట్లు కాలవడం లేదని, ఫ్యాన్లు, టీవీలు ఉన్న తమలాంటి కుటుంబాలు అన్ని యూనిట్లు కరెంటు ఎలా ఖర్చు చేస్తారంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు చక్రాల వాహనలున్నాయంటూ ఎగరగొట్టేందుకు చూస్తున్నారని బాధితులు ఆవేదనతో వాపోతున్నారు. పట్టణాలలో రూ.12 వేలు, గ్రామాల్లో రూ.10 వేలకు మించి ఉన్న ఆదాయం వారందరికీ తల్లికి వందనం పథకం ఉఫ్ అనిపించారు. ఎర్రగుంట్ల పట్టణంలోని అన్ని సచివాలయాలలో చుట్టూ బాధితులు వందలాది మంది ప్రదక్షినలు చేస్తున్నారు. కరెంటు ఆఫీస్, తహసీల్దార్ కార్యాలయం వద్దకు పరుగులు పెడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికి వర్తింపు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కూలాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణీకంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఇంటి వద్దకు వలంటీర్లు వెళ్లి వారి వద్ద ఉన్న ఆధారాలు తీసుకుని వలంటీర్లే దరఖాస్తు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూటమి పార్టీలకు అనుకూలంగా ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్నికలలో రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.13 వేలు ఇస్తున్నారని మండి పడ్డారు.

పది ఎకరాలు భూమి ఉందని అనర్హత జాబితాలో చూపించారు



మాకు పది ఎరకాలు భూమి ఉందంటూ అనర్హత జాబితాలో వచ్చింది. మేం ఎర్రగుంట్ల పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాం. మాకు ఉన్న కొద్దిపాటి పోలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు మహాలక్ష్మీ అనే కుమార్తె ఉంది. తల్లికి వందనం మాకు రాలేదు. సచివాలయం వద్దకు పోతే భూమి ఎక్కువంగా ఉందని చెప్పారు. మా ఆయన శివశంకర్‌రెడ్డి వ్యవసాయం కూలీగా పనిచేస్తుంటాడు.

– మాధురి, వినాయక నగర్‌కాలనీ, ఎర్రగుంట్ల

ముగ్గరు పిల్లలు ఉన్నా... ఏ ఒక్కరికి రాలేదు



మేం రజక కులస్తులం. బట్టలు ఉతుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మా ఆయన కూలీ పని చేస్తుంటాడు. మాకు ముగ్గరు పిల్లలు. వారిలో పద్మశ్రీ(ఇంటర్) వర్షశ్రీ(8వ తరగతి), కీర్తన(6వ తరగతి). ఈ ముగ్గరికి తల్లికి వందనం పథకం జాబితాలో ఏ ఒక్కరి పేరు రాలేదు. అడిగితే మీకు పథకం వర్తించలేదంటున్నారు. కూలీ పనులుచేసుకునే మాకే ఎందుకు వర్తించదని వారి వాపోయ్యారు. గత ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద మాకు మూడు సార్లు డబ్బు పడింది. మొదటి సారి రూ.15 వేలు, మిగత మూడు సార్లు రూ.13 వేలు పడింది. – క్ష్మీదేవి, శాంతినగర్, ఎర్రగుంట్ల

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పుట్టకోనమ్మ అమ్మవారి గ్రామోత్సవం

వేముల : మండలంలోని వి.కొత్తపల్లెలో వెలసిన శ్రీపుట్టకోనమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పుట్టకోనమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గ్రామంలో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అలాగే మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టకోనమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్కభజన భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు లీలావతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, మల్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

లింగాల : ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో యోగాంధ్ర నిర్వహణపై మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6.30 గంటలకు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డీటీ నరేంద్ర, ఏపీఓ గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతో అవసరం



ధ్యానం గురించి వివరిస్తున్న యోగా గురువు వెంకట్రామిరెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి నిత్యం యోగా, ధ్యానం చేయడంవల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన ధ్యానం గురించి వివరించారు. ముందుగా సూర్య నమస్కారాలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి వివిధ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందికి యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్య సమస్యలు దూరమవ్వడంతోపాటు మనిషి ఎంతో ఉత్సాహంగా, ఆరోగ్యదాయకంగా ఉండటానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ కళ్యాణ్, ఎంఈఓలు ఓబులేసు, శారద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను దోచుకుంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలు



ఎంఈఓతో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్

పులివెందుల టౌన్ : విద్యార్థులను చదువు పేరుతో దోచుకోవడమే ధ్యేయంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నాయని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్ ఆరోపిస్తున్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఆయన విద్యాశాఖ అధికారులను ఫీజుల దోపిడీ విషయంలో కార్పొరేట్ విద్యా సంస్థలు దోచుకుంటున్న విషయంపై నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్క తోక.. వంకరే అన్నట్టు ప్రైవేట్ స్కూల్స్, కార్పొరేట్ స్కూల్స్ కూడా వంకరే అని, విద్యార్థి సంఘాలు ఎన్ని దీక్షలు చేసిన ఎన్ని ధర్నాలు చేసిన ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎందుకంటే ఎలాంటి సమస్యనైనా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రైవేట్ స్కూల్స్, కార్పొరేట్ స్కూల్స్‌లో లక్షలు లక్షలు ఫీజులు–అడ్మిషన్ ఫీజులు వసూల్ చేస్తున్నారని, పుస్తకాలు, షూస్, టై, యూనిఫాం పాఠశాలల్లోనే కొనాలని తల్లిదండ్రులకు చెప్పి వారి రక్తాలు తాగుతున్నారన్నారు. ఈ కార్పొరేట్ విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలను తల్లిదండ్రులు వచ్చి విద్యార్థి సంఘాలకు తెలియజేశారని, విద్యార్థి సంఘాలు ఆ స్కూల్స్ దగ్గరకి వెళ్లగా ఎలాంటి సమాధానం ఇవ్వడంలేదన్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా వారు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీటిపై ఎంఈఓ స్పందించకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తొండూరు : మండలంలోని అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల హెడ్మాస్టర్ బాబురెడ్డి ఆధ్వర్యంలో దాతలు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, అలవలపాటి రఘురామిరెడ్డిలు పదవ తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన డి.గంగాశ్రీవిద్యకు రూ.3వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన బి.విష్ణుచరితకు రూ.2వేల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు మేకల చంద్రశేఖరరెడ్డి, ఇమామ్ సాహేబ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేస్తున్న డీఎస్‌ఆర్ యువసేన సభ్యులు

పులివెందుల : సహృదయుడు, సేవాతత్పరుడు, అందరివాడుగా పేరుగాంచిన దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి తన జీవితాంతం వైఎస్ కుటుంబాన్నే నమ్ముకుని, తనకు తోడుగా ఉన్న కార్యకర్తల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే ప్రజా నాయకుడని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగపు నియోజకవర్గ కన్వీనర్ చాగలేటి భాస్కర్ తెలిపారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నేత దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి 58వ జన్మదినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గురువు జన్మదినోత్సవాన్ని శిష్యుడు అర్కట వేముల డేనియల్ ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా క్రిస్టియన్ లైవ్ డేనియల్ ఆర్థిక సహాయంతో బుధవారం పట్టణంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో 50 మంది దివ్యాంగులకు చాగలేటి భాస్కర్ చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. అంతకుముందు డీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో శంకర్‌రెడ్డి జన్మదినోత్సవ కేక్ కట్ చేసి దివ్యాంగులకు అందించారు. అనంతరం అర్కట వేముల డేనియల్ ఆధ్వర్యంలో రోడ్లపైన ఆకలితో అలమటిస్తున్న నిరాశ్రయులకు, యాచకులకు డీఎస్ఆర్ యువసేన సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దివ్యాంగుల మున్సిపల్ కన్వీనర్ శీలం సునీల్‌కుమార్, వికలాంగుల నెట్‌వర్క్ నాయకులు రఘునాథరెడ్డి, శివాజీ, ప్రభాస్, డీఎస్ఆర్ యువసేన కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో తాగునీటి ఎద్దడికి చర్యలు



తాగునీటికి సంబంధించిన విద్యుత్ మోటార్‌ను పరిశీలిస్తున్న ఈఓ మాధవరెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీరామ్‌నగర్‌లో నాలుగు రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను ప్రజలు బుధవారం పంచాయతీ ఈఓ మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈఓ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. మీ ప్రాంతంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పాతపేట, కాపు వీధి, గాండ్ల వీధి, మెయిన్ బజార్, సంత మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండటంతో ఇటీవల పాపాఘ్ని నదిలో రెండు ఫిల్టర్లను వేసి స్టార్టర్లు అమర్చారని, అయితే తాగునీటి ఫిల్టర్లు నుంచి పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని ఈఓకు తెలిపారు. దీంతో అ ప్రాంతాల్లో కూడా రోజు రోజుకు తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ కనెక్షన్ ఇచ్చి ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగించాలని కోరారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

వల్లూరు : మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండంలోని వల్లూరు గ్రామ సమాఖ్య–3లోని ఏ ఓబాయపల్లెలో లక్ష్మీనరసింహస్వామి గ్రూపుకు చెందిన సభ్యురాలు దాసరి కేశమ్మ ఉన్నతి పీఎం ఏజేఏవై పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గు పిండి, రంగోలి కలర్స్), కిరాణా షాప్‌లను బుధవారం పీడీ సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం యామినీ పూర్ణిమ, లబ్ధిదారులు, సంఘ సభ్యులు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బోనాల గ్రామానికి చెందిన పోచమిరెడ్డి పెద్ద వెంకటరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు పి.వి.రమణారెడ్డి, ఆయన సోదరులు వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం



ఆక్రమణలపై అధికారులతో వాగ్వివాదం చేస్తున్న స్థానికులు

ముద్దనూరు : రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకుంటే నేషనల్ హైవే అధికారులే తొలగిస్తారని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం అక్రమ కట్టడాలను తొలగించాలని సూచించిన ఎన్‌హెచ్ అధికారులు, స్థానికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఎన్‌హెచ్ అధికారులు ఇష్టారాజ్యంగా కొలతల నియమాలను పాటించకుండా డ్రైనేజి నిర్మాణం చేపట్టారని, అన్నిచోట్ల ఒకే కొలత వుండేలా విస్తరణ చేపట్టాలని, దీంతో కొంతమందికి అన్యాయం జరుగుతోందని వాదించారు. తాము జాతీయ రహదారికి చెందిన ప్రాంతంలోనే నిర్మాణాలు చేపట్టామని, ఎవరి స్థలాల్లో అక్రమంగా నిర్మాణం చేపట్టలేదని, అవసరమైతే రెవెన్యూ, పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణాలను తొలగించి రహదారి విస్తరణ పనులు చేపడుతామని ఎన్‌హెచ్ ఏఈ విశ్వనాథ్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం రహదారి విస్తరణ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన సంగతి విదితమే.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించండి



మల్లేలలో పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

తొండూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని తొండూరు, మల్లేల గ్రామాల్లో ఆయన పర్యటించి చీనీ, తదితర పంటలను పరిశీలించి సాగు పద్ధతులపై సూచనలు, సలహాలు ఇచ్చారు. చీనీలో భూమి ఖాళీ లేకుండా నవధాన్య సాగు చేసుకోవాలని, వీటివలన భూతాపం తగ్గి భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. చీనీలో జీవామృతం స్ప్రే చేసుకుంటే పురుగులు, తెగుళ్ల రాకుండా మొక్క ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ నరసింహారెడ్డి, యూనిట్ మాస్టర్ ట్రైనర్ నాగసుబ్బరాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీవామృతం మొక్కకు ప్రాణం



ఖాళీ భూమిలో విత్తన విధానాన్ని పరిశీలిస్తున్న ఏఓ

పులివెందుల రూరల్ : అరటి మొక్కకు జీవామృతం ప్రాణమని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రకృతి వ్యవసాయ విధానాలలో నవధాన్యాల పద్ధతి ద్వారా అన్ని రకాల విత్తనాలను ఖాళీగా ఉన్న భూములలో విత్తిన విధానాన్ని పరిశీలించారు. ఈ విధానం ద్వారా అన్ని రకాల విత్తనాల మొక్కల వేర్ల నుండి భూమికి కావాల్సిన పోషకాలు అందిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి జీవామృతం తయారు చేసి అక్కడే డెమోగా చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : పంటల సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ ఓబులేసు తెలిపారు. మండలంలోని నల్లచెరువుపల్లె, కొండ్రెడ్డిపల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలంటే సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా భూసార పరీక్షలనుసరించి పంటలకు ఎరువులను అందించాలన్నారు. భాస్వరం దుక్కిలో వేయడంవల్ల పంటలకు మేలు చేకూరుతుందన్నారు. పంటలు సాగు చేశాక నత్రజని, పొటాష్ ఎరువులు మాత్రమే వేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎంపీడీఓ సురేష్, వీపీఏ సుధ, రైతులు పాల్గొన్నారు.

ఏడాది కూటమి పాలన పూర్తిగా విఫలం



కమలాపురంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వల్లూరులో పుస్తకాన్ని అవిష్కరిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

పెండ్లిమర్రి : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అప్పులు తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ పి. బాలయ్యలు తెలిపారు. బుధవారం పెండ్లిమర్రిలో జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని పార్టీ నాయకులతో కలిసి వారు అవిష్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీఅమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ నాగమ ల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైజం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధా ఉత్తమారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం దృశ్య మాలిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, మహ్మద్ సాదిక్, ఆర్‌వీఎస్‌ఆర్, దేవదానం, జెట్టి నగేష్, మర్రి సుబ్బన్న, జాఫర్, మైసూరారెడ్డి, దాసరిసురేష్, గఫార్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండల కన్వీనర్ గూడా ప్రభాకరరెడ్డి, కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు తెలిపారు. బుధవారం వారు మండల నాయకులతో కలసి జగనన్న అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు సురేంద్రారెడ్డి, ప్రసాదరెడ్డి, గంగాధరరెడ్డి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని మండల కన్వీనర్ కల్లూరు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీనియర్ నాయకుడు రాజుపాలెం వెంకటరామిరెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరామిరెడ్డి, రాఘవయాదవ్, సర్పంచులు నరేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, శేఖర్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ శివాంజనేయరెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : సూపర్ సిక్స్ హామీల అమలు చేస్తామని చెప్పి అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు సంవత్సర పాలనలో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వల్లూరు మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన జగన్ అంటే నమ్మకం –చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, పీ శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరులో బుధవారం జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని చెన్నూరు మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్, కడప మాజీ యార్కెట్ కమిటీ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగ జనరల్ సెక్రటరీ భాగ్యమ్మలు ఆవిష్కరించి మాట్లాడారు.